# ఇద్దరి జీవితాల్లో వెలుగు

## మీరు చేసే నేత్రదానం



మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి : మహబూబ్ నగర్ శ్రీనివాస్ శ్రీనివాస కాలనీ, వాసి అయిన క్షీరాసాగర్ కస్తూరి బాయ్, నేత్రదానం చేసేందుకు, ముందుకు, వచ్చి ఇద్దరికి చూపును ప్రసాదించి క్షీరసాగర్ కస్తూరిబాయి... ఆదర్శంగా నిలిచారు.మరణించిన మరోమారు ప్రపంచాన్ని చూసే అద్భుత అవకాశం నేత్రదానం చేయడం వల్లే లభిస్తుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న మహబూబ్‌నగర్, శ్రీనివాస కాలనీ వాసి క్షీరసాగర్ కస్తూరిబాయి (81) ..మిగతా 2లో



www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 11 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08

# అక్షిత ఎఫెక్ట్...



### డస్ట్ దందా బట్టబయలు
### నిద్రలో జిల్లా యంత్రాంగం!

### బోరిగాం గోడౌన్ వద్ద
### హడావుడిగా ఇసుక కుప్పలు

### అక్షిత కథనంతో కాంట్రాక్టర్ లో గుబులు!

### విచారణ ఎక్కడ? చర్యలు ఏవి? అధికారుల మౌనం వెనుక ఏదో తేడా ?



**లక్ష్మణ్ చందా/బోరిగాం, అక్షిత న్యూస్:** అక్షిత అక్షర ప్రభావానికి బోరిగాం డస్ట్ దందా బట్టబయలైంది. లక్ష్మణ్ చందా మండలం బోరిగాంలోని టీఎస్ డబ్ల్యూసీ గోడౌన్ అదనపు భవన నిర్మాణంలో నిబంధనలకు విరుద్ధంగా 100% క్రషర్ డస్ట్ తోనే కట్టడాలు చేపడుతూ లక్షల్లో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని 05 అక్టోబర్ 2026న అక్షితలో ప్రచురితమైన పరిశోధనాత్మక కథనం పెను సంచలనం సృష్టించింది. అక్షిత కథనం అక్షర సత్యమని నిరూపిస్తూ, వార్తకు ముందు తీసిన ఫోటోల్లో సైట్‌లో ..మిగతా 2లో

# వరంగల్ చరిత్రను చిదిమిన కేసీఆర్

### వరంగల్‌కు కేసీఆర్ ద్రోహం.. స్వార్థ విభజనపై కాంగ్రెస్ ఫైర్

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



కాజిపేట్, అక్షిత ప్రతినిధి : వరంగల్ చరిత్రను కేసీఆర్ చిదిమివేశారు.కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ మహానగరాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అశాస్త్రీయంగా విభజించి, జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ..మిగతా 2లో

# పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ

### ప్రకృతి పరిమళాల పండుగ బతుకమ్మ

### ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల సంబురం

### తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయ వేడుక

### మహిళా నాయకురాలు నూనె సులోచన





కోదాడ, అక్షిత ప్రతినిధి : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. పూలను పూజిస్తూ, ప్రకృతిలోని అందాలను ఆస్వాదిస్తూ, మహిళలు సామూహికంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ..మిగతా 2లో

## ఇద్దరి జీవితాల్లో వెలుగు




**మొదటి పేజీ తరువాయి...**

వయోభారంతో మరణించారు. ఆమె మరణానంతరం నేత్రాలు మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలనే ఉద్దేశంతో ఆమె కళ్ళను దానం చేయడానికి సంకల్పించి వారి కుమారుడు ఓంప్రకాష్ మరియు వారి కూతుళ్లు సుప్రియ, శోభారాణి మరియు సంధ్యారాణి కుటుంబ సభ్యులు లయన్ జైపాల్ –అనిత, దత్తు, రెడ్ క్రాస్ కు సమాచారం అందించారు.

ఈ మేరకు చైర్మన్ లయన్ అంబటి నటరాజ్ మరియు లయన్ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ శివ సత్వరమే స్పందించి శనివారం ఉదయం 6:00 గంటలకు 'కార్నియా' ను సేకరించి, కుటుంబ సభ్యులకు ధృవీకరణ పత్రం అందించారు. ఈ సందర్భంగా లయన్ అంబటి నటరాజ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 278 మంది తమ 'కార్నియా' ను దానంచేసి 556 మందికి చూపు కల్పించారని తెలిపారు.

అలాగే బాధలో ఉన్నప్పటికి కార్నియా దానానికి ఒప్పుకొన్న క్షీరసాగర్ కస్తూరిబాయి కుటుంబ సభ్యులకు లయన్ అంబటి నటరాజ్, లయన్ బాబుల్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ పాలమూరు తరపున ధన్యవాదాలు తెలిపారు.

## వరంగల్ చరిత్రను చిదిమిన కేసీఆర్



**మొదటి పేజీ తరువాయి...**

తీవ్రంగా ఖండించారు. వరంగల్ జిల్లాల విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి, వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించిన కేసీఆర్ నిర్ణయానికి నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు నల్లజెండాలు, నిరసన నినాదాలతో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జిల్లాల విభజనకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్వరూపం, ప్రజల అవసరాలు, యువత భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వరంగల్‌ను విభజించడాన్నే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాను అశాస్త్రీయంగా విభజించడం వల్ల ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యత దెబ్బతినడంతో పాటు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, స్థానికత ఆధారంగా లభించాల్సిన ప్రయోజనాల విషయంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే ఈ అన్యాయాన్ని పలుమార్లు ప్రశ్నించామని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వరంగల్ అభివృద్ధికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ,డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షిత ఎఫెక్ట్...

**మొదటి పేజీ తరువాయి...**

ఎక్కడా ఇసుక జాడ లేకుండా కేవలం నల్లటి డస్ట్ కుప్పలు మాత్రమే దర్శనమివ్వగా, అక్షిత వార్త వెలువడిన మరుసటి రోజే అదే సైట్ లో భారీ ఎత్తున నది ఇసుక కుప్పలు మాయమాట మంత్రంలా ప్రత్యక్షమయ్యాయి. అక్షిత కథనంతో కాంట్రాక్టర్ దిగిరాక తప్పలేదని, తప్పును కప్పిపుచ్చుకునేందుకు హడావుడిగా ఇసుక తెప్పించి కళ్లుగప్పే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**జిల్లా అధికారుల మౌనం వెనుక మతలబు ఏంటి?**

లక్షల రూపాయల ప్రభుత్వ సొమ్ముతో నిర్మిస్తున్న గోడౌన్ లో ఇంతటి నాణ్యతా లోపం జరుగుతున్నట్లు వార్త వచ్చి 5 రోజులు గడుస్తున్నా, జిల్లా స్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఈఈ, డిఈలు ఇంతవరకు ఎందుకు సైట్ ను సందర్శించలేదు? – అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్షిత కథనంపై కలెక్టర్ ఇప్పటివరకు ఎందుకు విచారణకు ఆదేశించలేదు? అని రైతులు నిలదీస్తున్నారు. వార్త రాగానే కాంట్రాక్టర్ కు సమాచారం లీక్ చేసి "వెంటనే ఇసుక తెప్పించు" అని సలహా ఇచ్చింది అధికారులేనా? అనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రాణాలతో చెలగాటమా?**

ఇసుకకు బదులు డస్ట్ వాడితే భవనం పటిష్టత దెబ్బతింటుందని, కొన్నేళ్లలోనే పిల్లర్లు, గోడలు కూలిపోయి అందులో నిల్వ చేసే వేల టన్నుల ధాన్యానికి, అక్కడ పనిచేసే కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి ప్రమాదకర నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక భారీ స్థాయిలో అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ వెంటనే సుమోటోగా స్పందించి విజిలెన్స్ ఽ ఎన్ ఫోర్స్ మెంట్ విచారణకు ఆదేశించాలని డిమాండ్. ఇప్పటివరకు డస్ట్ తో నిర్మించినట్లు ఆరోపణలు వస్తున్న పిల్లర్లు, గోడలకు ఎన్ డి టి, క్యూబ్ టెస్ట్ లు నిర్వహించాలని డిమాండ్. ఇసుక కొనుగోలు బిల్లులు, రవాణా బిల్లులు, ల్యాబ్ రిపోర్టులు బహిరంగపరచాలని డిమాండ్. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ

**మొదటి పేజీ తరువాయి...**

విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉంది. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ సంబురాలు పల్లెలు, పట్టణాలను పూల సోయగాలతో నింపుతాయి. చెరువులు, వాగులు, పొలాలు, పచ్చని ప్రకృతి ఒడిలో విరబూసే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ మహిళలు ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకుంటారు.

ఎంగిలిపూల బతుకమ్మతో పండుగకు శ్రీకారం

బతుకమ్మ పండుగలో మొదటి రోజుకు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ రోజుతో తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి. సంప్రదాయం ప్రకారం మహిళలు తమకు అందుబాటులో ఉన్న కాలానుగుణ పూలను సేకరించి బతుకమ్మను తయారు చేస్తారు. ఎంగిలిపూల బతుకమ్మ పేరుకు సంబంధించి ప్రాంతానికో విధమైన ఆచారాలు, పెద్దలు చెప్పే సంప్రదాయ కథనాలు ఉన్నాయి. పూలను సేకరించడం, పేర్చడం, పూజించడం ద్వారా పండుగకు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతితో ముడిపడిన జీవన విధానం ప్రతిబింబిస్తుంది.

ఎంగిలిపూల బతుకమ్మ రోజున ఇళ్లను శుభ్రం చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించి, కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు మహిళలతో కలిసి బతుకమ్మను అలంకరిస్తారు. తొలి రోజు బతుకమ్మ సాధారణంగా చిన్న పరిమాణంలో తయారు చేసినప్పటికీ, భక్తి, సంప్రదాయం, ఆప్యాయతలకు అది ప్రతీకగా నిలుస్తుంది. తొమ్మిది రోజుల పండుగలో ప్రతి రోజుకూ ప్రత్యేకమైన పేరు, నైవేద్యం, ఆచారం ఉండటం బతుకమ్మ విశిష్టతను తెలియజేస్తుంది.

**చారిత్రక నేపథ్యం..**
**తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం**

బతుకమ్మ పండుగకు సంబంధించిన చరిత్రపై పలు జానపద కథలు, స్థానిక విశ్వాసాలు ప్రచారంలో ఉన్నాయి. పార్వతీదేవి ఆరాధనతో పాటు ప్రకృతి పూజ, పంటల సమృద్ధి, కుటుంబ సంక్షేమం వంటి అంశాలు ఈ పండుగలో ప్రధానంగా కనిపిస్తాయి. బతుకమ్మ అనే పదాన్ని 'బతుకు అమ్మా' అనే భావంతో అన్వయిస్తూ, మహిళలు తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తారు.



తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయం, వర్షాలు, చెరువులు, పూలు ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. వర్షాకాలం ముగిసి, చెరువులు నీటితో కళకళలాడే సమయంలో ప్రకృతిలో సహజంగా పూసే పూలతో బతుకమ్మను తయారు చేయడం ఈ పండుగకు ప్రత్యేకతను తెచ్చింది. బతుకమ్మకు సంబంధించి ప్రచారంలో ఉన్న జానపద కథనాలు, చారిత్రక వివరణలు ప్రాంతాన్ని బట్టి మారుతున్నప్పటికీ, ప్రకృతిని గౌరవించడం, మహిళల ఐక్యతను చాటడం, కుటుంబ శ్రేయస్సును కోరుకోవడం వంటి విలువలు తరతరాలుగా కొనసాగుతున్నాయి.

**బతుకమ్మలో ఉపయోగించే పూల ప్రత్యేకత...**

బతుకమ్మను అందంగా తీర్చిదిద్దడంలో పూలదే ప్రధాన పాత్ర. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి పూలు, కట్ల పూలు, నందివర్ధనం తదితర కాలానుగుణ పూలను ప్రాంతీయ సంప్రదాయాలకు అనుగుణంగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా తంగేడు, గునుగు పూలకు బతుకమ్మలో ప్రత్యేక స్థానం ఉంది. పసుపు, తెలుపు, గులాబీ, ఎరుపు వంటి వివిధ రంగుల పూలు బతుకమ్మకు సహజమైన అందాన్ని అందిస్తాయి.

తంగేడు పూల పసుపు వర్ణం, గునుగు పూల ప్రత్యేక ఆకృతి, బంతి పూల ఆకర్షణీయమైన రంగులు బతుకమ్మను కనుల పండువగా మారుస్తాయి. పూలను కేవలం అలంకరణ కోసం మాత్రమే కాకుండా, ప్రకృతిలో లభించే వనరుల పట్ల గౌరవానికి చిహ్నంగా భావిస్తారు. కాలానుగుణంగా పూసే స్థానిక పూలను సేకరించడం వల్ల పల్లెల్లోని ప్రకృతి అందాలు, సంప్రదాయ జ్ఞానం, పర్యావరణంతో మనిషికి ఉన్న అనుబంధం కూడా గుర్తుకు వస్తాయి.

**బతుకమ్మను ముస్తాబు చేసే విధానం**

బతుకమ్మను పేర్చడం ఒక ప్రత్యేకమైన కళ. ముందుగా వెడల్పుగా ఉండే తాంబాళం లేదా పళ్లెంలో ఆకులు పరిచి, వాటిపై పూలను వరుసలుగా పేర్చడం ప్రారంభిస్తారు. సాధారణంగా అడుగు భాగంలో పెద్దవిగా, విస్తృతంగా ఉండే పూలను అమర్చి, ఆపై ఒక్కో వరుసను కొద్దికొద్దిగా చిన్నదిగా చేస్తూ గోపురం ఆకారంలో తీర్చిదిద్దుతారు. ఒక్కో వరుసలో ఒకే రకం లేదా వివిధ రంగుల పూలను క్రమపద్ధతిలో అమర్చడం వల్ల బతుకమ్మకు ఆకర్షణీయమైన రూపం వస్తుంది.

పూలను ఒకదానిపై మరొకటి సమతూకంగా పేర్చి, పైభాగంలో గుమ్మడి పువ్వు లేదా సంప్రదాయానికి అనుగుణంగా పసుపుతో తయారు చేసిన గౌరమ్మను ఉంచుతారు. కొన్ని ప్రాంతాల్లో పసుపు గౌరమ్మను ప్రత్యేకంగా అలంకరించి బతుకమ్మపై ప్రతిష్ఠిస్తారు. పూల వరుసల మధ్య రంగుల కలయికను జాగ్రత్తగా చూసుకుంటూ మహిళలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ప్రతి ఇంట్లో తయారయ్యే బతుకమ్మకు ప్రత్యేకమైన ఆకృతి, అలంకరణ ఉండటం ఈ పండుగలోని సృజనాత్మకతకు నిదర్శనం.

బతుకమ్మను తయారు చేసిన అనంతరం పూజలు నిర్వహించి, మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ చుట్టూ వలయాకారంలో తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతారు. చప్పట్లు కొడుతూ లయబద్ధంగా ఆడే ఆటలు పండుగకు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయి. పాటల్లో దేవతా ఆరాధనతో పాటు కుటుంబ బంధాలు, గ్రామీణ జీవితం, సామాజిక సంబంధాలు, మహిళల అనుభవాలు ప్రతిబింబిస్తాయి.

**తొమ్మిది రోజుల బతుకమ్మ..**
**ఒక్కో రోజుకు ప్రత్యేకత**

బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులకు ప్రత్యేకమైన పేర్లు, సంప్రదాయాలు ఉన్నాయి. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మతో వేడుకలు ముగుస్తాయి. ప్రాంతీయ ఆచారాల ప్రకారం పేర్లలో స్వల్ప మార్పులు కనిపించవచ్చు.

ప్రతి రోజూ ప్రత్యేకమైన నైవేద్యాలు సమర్పిస్తూ అమ్మవారిని పూజిస్తారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రంగురంగుల పూలతో పెద్ద బతుకమ్మలను తయారు చేసి, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి సామూహికంగా వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం సంప్రదాయ ప్రకారం బతుకమ్మలను చెరువులు లేదా ఇతర జలవనరుల వద్ద నిమజ్జనం చేస్తారు.

# అక్షిత ఎఫెక్ట్...

నిర్మల్ మాల్స్ ట్రాఫిక్ ఇక్కట్లపై ఎస్పీ స్పందన!

## పార్కింగ్ లేదు.. సెట్ బ్యాక్ లేదు.. అక్షిత కథనానికి పోలీస్ శాఖ రియాక్షన్




**నిర్మల్, అక్షిత న్యూస్:** నిర్మల్ పట్టణంలోని షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్ సౌకర్యం లేక, సెట్ బ్యాక్స్ ఆక్రమించి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని, అనుమతులు లేకుండా ఎలా నడుస్తున్నాయంటూ అక్షిత దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది.

అక్షిత కథనాన్ని సీరియస్ గా తీసుకున్న నిర్మల్ ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఇంచార్జ్ సాయికిరణ్, ఐపీఎస్ చొరవ తీసుకుని నాలుగు ప్రధాన షాపింగ్ మాల్స్ యాజమాన్యాలను



పిలిపించి కౌన్సిలింగ్ చేశారు.

సీబీఎస్ షాపింగ్ మాల్, మాంగల్య షాపింగ్ మాల్, ఆనంద్ షాపింగ్ మాల్, చెన్నై షాపింగ్ మాల్ లకు 6 అక్టోబర్ 2026న పోలీసులు నోటీసులు జారీ చేసి, తమ కస్టమర్లకు సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కఠినంగా ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీ నిర్మల్ అధికారిక ఎక్స్ ఖాతాలో ప్రకటన విడుదల చేశారు.

షాపింగ్ మాల్ యాజమాన్యాలు తమ కస్టమర్లకు సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు మరియు జిల్లా యంత్రాంగంలోని ఇతర భాగస్వామ్య శాఖలకు కూడా తెలియజేశాము. నిర్మల్ టౌన్ పోలీసుల ద్వారా నోటీసులు జారీ చేశాము. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు అమలు చర్యలు కొనసాగుతాయి.

**నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలా**

అక్షిత కథనానికి సత్వరమే స్పందించిన నిర్మల్ పోలీస్ శాఖకు స్థానిక ప్రజలు, వాహనదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# కోదాడలో 540 గ్రాముల గంజాయి స్వాధీనం

## గంజాయి విక్రయించేందుకు వస్తుండగా యువకుడి అరెస్ట్

## నిందితుడి వద్ద మొబైల్ ఫోన్ సహా రూ.22,500 విలువైన ఆస్తి స్వాధీనం



**కోదాడ రూరల్,అక్టోబర్ 9 (అక్షిత న్యూస్):** కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామ పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి-65పై గంజాయిని తరలిస్తున్న యువకుడిని కోదాడ రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం ఆల్వాలపురం గ్రామానికి చెందిన మద్దే రవితేజ (22) వద్ద తనిఖీలు నిర్వహించగా 540 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు ఒక స్మార్ట్ మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 22,500గా అంచనా వేశారు. లిగతంలోనూ గంజాయి కేసులి:పోలీసుల కథనం ప్రకారం.. నిందితుడు గత కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో 2026 జూలై 29న కోదాడ టౌన్ పోలీసులు అతడిని పట్టుకొని కేసు నమోదు చేయగా, జైలుకు వెళ్లి సెప్టెంబర్ 22న విడుదలయ్యాడు. అనంతరం మళ్లీ గంజాయితో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

**కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు**

అక్టోబర్ 9న మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో రామాపురం క్రాస్ రోడ్డు నుంచి కోదాడ వైపు వస్తున్న రవితేజను కోదాడ రూరల్ ఎస్ఐ ఎస్.కె. యాకూబ్ తన సిబ్బందితో కలిసి అనుమానంతో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గంజాయి లభించడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. కోదాడలో విక్రయించేందుకు గంజాయిని తీసుకువస్తున్నట్లు నిందితుడు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 208/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు కోదాడ రూరల్ సీఐ డి. రామకృష్ణారెడ్డి తెలిపారు.

# తెలంగాణ జర్నలిస్టుల జేపసి జిల్లా సహాయ కార్యదర్శిగా సిర మహేష్

## ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజెజెఏసి)యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడిగా రామన్నపేట కేంద్రానికి చెందిన అక్షిత న్యూస్ కరస్పాండెంట్ సిర మహేష్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు తొగరి కరుణాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్టు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగ చాందిని ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతనంగా నియమితులైన సిర మహేష్ తక్షణమే




బాధ్యతలు చేపట్టి జేఏసీ నియమ నిబంధనలను పాటిస్తూ క్రమశిక్షణతో పని చేయాలని సంస్థ చేపట్టే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆశయాలకు అనుగుణంగా యూనియన్లు, ప్రెస్ క్లబ్ లు, అసోసియేష్ లు అన్ని వర్గాల జర్నలిస్టు మిత్రులను కలుపుకొని నిరంతరాయంగా కృషి చేస్తూ జేఏసీ ఆశయాలు నెరవేరేవరకు నాకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ నా వంతు సహకారం అందిస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జర్నలిస్ట్ మిత్రులకి ధన్యవాదాలు తెలిపారు.

# ఈనెల 14న మన్ననూరు గ్రామంకు వచ్చేస్తున్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశి కృష్ణ



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ఈనెల 14వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో 220/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విచ్చేస్తున్నారు. కావున అచ్చంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉమ్మడి అమ్రాబాద్ మరియు పదర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు, పాల్గొనగలరని అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ

## అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు....

## ఆడపడుచులందరూ పాల్గొని విజయవంతం చేయాలి...

## మున్సిపల్ ఛైర్పర్సన్ ఎర్నేని కుసుమ

**కోదాడ అక్షిత ప్రతినిధి:** బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, పూల సౌందర్యానికి ప్రతీక. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఐకమత్యం, స్త్రీల సృజనాత్మకతను చాటిచెప్పే అద్భుతమైన పండుగ బతుకమ్మ అని మున్సిపల్ ఛైర్పర్సన్ ఎర్నేని కుసుమ అన్నారు.



శనివారం కోదాడ బాయ్స్ హై స్కూల్ నందు కోదాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... మహిళా మణులు అందరికీ బతుకమ్మ పండుగ మరియు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరశెట్టి మల్లేశ్వరి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి ,మహిళా మండలి అధ్యక్షురాలు నూనె సులోచన, మున్సిపల్ కౌన్సిలర్ వంగూరి గోపి , కొండలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## లింగాల మేజర్ గ్రామపంచాయతీలో దసరా పండుగ పురస్కరించుకొని వీధి దీపాలు

### గ్రామ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల మేజర్ గ్రామపంచాయతీలో దసరా పండుగ పురస్కరించుకొని గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు వేశారు. దసరా పండుగ ఎంతో ఉత్సాహంగా జరుపుకొనుటకు ప్రతి వీధిలో వెలుతురు ఉండే విధంగా గ్రామ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య, ఆధ్వర్యంలో వీధి దీపాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు ,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రభ రిపోర్టర్ గుండెపూరి వెంకన్నకు మాతృవియోగం



త్రిపురారం అక్షిత న్యూస్ 10: త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన మిర్యాలగూడ డివిజన్ ఆంధ్రప్రభ రిపోర్టర్ గుండెపూరి వెంకన్న మాతృమూర్తి గుండెపూరి రాములమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు.

రాములమ్మ మృతి పట్ల పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రజా ప్రతినిధులు,ముఖ్యనాయకులు,కార్యకర్తలతో కలిసి మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముడిమల్ల బుచ్చి రెడ్డి మరియు మాజీ యం.పి.పి గౌ సలహాదారులు అనుముల శ్రీనివాస్ రెడ్డి భౌతికాయాన్ని సందర్శించి మాల వేసి ఘన నివాళులు ఘటించి మాతృమూర్తిని కోల్పోయిన గుండెపూరి వెంకన్నకు,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు(ఖు),మాజీ సర్పంచ్ అవిరెండ్ల వీరయ్య,గ్రామ పార్టీ అధ్యక్షులు పల్లపు యల్లయ్య ,అర్రూరి సైదులు,మండల యువ నాయకులు మజ్జిగపు శ్రీనివాస్ రెడ్డి, పడిశాల శేఖర్ ,అనుముల మట్టయ్య,గ్రామ పార్టీ యూత్ అధ్యక్షులు మదుపు బంగారు ,గ్రామ పార్టీ సోషల్ మీడియా మడుపు మహేష్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలున్నారు.

## తెలంగాణ సాంస్కృతికి ప్రతీక బతుకమ్మ



నాంపల్లి, అక్షిత న్యూస్: మండల పరిధిలోని దామెర ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించి ప్రకృతి పూల మొక్కలపై ప్రేమను ఏ విధంగా పెంపొందిస్తుందో తంగేడు పువ్వు ఇతర మొక్కల పూలు ఆకులు బతుకమ్మ నిమజ్జనం చేసినప్పుడు ఏ విధంగా చెరువు నీటిని శుభ్రపరుస్తాయో పర్యావరణ సమతుల్యతకు చెరువు నీటి శుద్ధికి తోడ్పడే విధానాన్ని వివరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందా రాజశేఖరం, ఉపాధ్యాయులు యాదయ్య,వెంకటరమణ, హిమామ్, శ్రీహరి, మహేష్,ఉజ్వల, శ్రవణ్,శిరీష, రవి, సాజిదా బేగం, శివరాణి, సౌజన్య విద్యార్థులు పాల్గొన్నారు.

## చేపలు, తాబేళ్ల వేటకు వెళ్లి
# ప్రాణాలు కోల్పోయిన మోతే కిరణ్

### శుక్రవారం గల్లంతు.. శనివారం ఉదయం మృతదేహం వెలికితీత

### మృతుడి కుటుంబ సభ్యుల అనుమానాలు.. ఘటనపై పోలీసుల దర్యాప్తు



రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని చెరువులో మునిగి మోతే కిరణ్ అనే యువకుడు మృతి చెందాడు. చేపలు, తాబేళ్ల వేటకు వెళ్లిన యువకుడు చెరువులో గల్లంతై ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. శుక్రవారం చెరువులో గల్లంతైన కిరణ్ మృతదేహాన్ని శనివారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్ బృందం వెలికితీసింది.

**చేపలు, తాబేళ్ల వేటకు వెళ్లి..**

వివరాల్లోకి వెళితే.. మోతే కిరణ్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెంకటాపూర్ గ్రామ శివారులోని చెరువు వద్దకు చేపలు, తాబేళ్ల వేటకు వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో కిరణ్ చెరువులో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న అధికారులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగి గాలింపు చేపట్టి శనివారం ఉదయం కిరణ్ మృతదేహాన్ని వెలికితీసింది.

**కుటుంబ సభ్యుల అనుమానాలు..**

కిరణ్ మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. స్నేహితుల ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి తమకు న్యాయం చేయాలని కోరాలని బంధువులు యోచిస్తున్నట్లు తెలిసింది. అయితే, ఘటనకు సంబంధించిన వాస్తవాలు



పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**ముగ్గురు చిన్నపిల్లలకు తండ్రిని దూరం చేసిన ఘటన..**

కిరణ్ మృతితో అతని కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మృతుడికి భార్య సుమతో పాటు ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న కిరణ్ మృతి చెందడంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో వెంకటాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**పోలీసుల దర్యాప్తు..**

మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కిరణ్ మృతికి దారితీసిన పరిస్థితులు, కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్న అనుమానాలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

## నాంపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

### సిపిఐ(ఎం) నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి



నాంపల్లి, అక్షిత న్యూస్: నాంపల్లి ని కరువు మండలంగా ప్రకటించాలి సిపిఐ(ఎం) నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి శనివారం నాంపల్లి మండల పరిధిలోని పస్నూరు గ్రామంలో ఉన్న పంటలను పరిశీలించడం జరిగింది. గుండ్ల వెంకటయ్య,దండిగా ఆంజనేయులు పొలాలు పూర్తిగా నీరు లేకపోవడంతో పగుళ్లు బట్టి మూడు ఎకరాలు నాలుగు ఎకరాలు ఎండిపోయిందని రైతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాంపల్లి మండలాన్ని కరువు మండలం గా ప్రకటించడంతోపాటు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపు వర్షాభావం లేక సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో ఎంతోమంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని ఆయన అధికారులను కోరారు. ఎల్ నీనో పరిస్థితిలు ఒకవైపు ఎల్‌నినో ప్రభావం మరోవైపు విద్యుత్ కొరత రోజుకు 7:00 నుండి 9 గంటల మాత్రమే కరెంటు ఇస్తున్న కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయానికి అవసరమైన మేరకు నాణ్యమైన విద్యుత్ సరఫర క్రాప్ హాలిడే ప్రకటించడం పరిష్కారం కాదని పంటల సాగుకు అవసరమైన నీరు విద్యుత్ అందించి వ్యవసాయాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రైతులతో కలిసి మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వాసిపాక ముత్తిలింగం, కొమ్ము లక్ష్మయ్య, ఆకారపు కాశయ్య, అందుగుల రాములు, ఆంజనేయులు, సైదులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థులకు కొత్త బట్టల పంపిణీ

### రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి పుల్లయ్య ఔదార్యం.. 30 మంది విద్యార్థులకు వస్త్రాల వితరణ



కాజీపేట, అక్షిత ప్రతినిధి : బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్త బట్టలు అందించి రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇట్టే పుల్లయ్య తన ఉదారతను చాటుకున్నారు. శుక్రవారం ఆర్ఈసీ పాఠశాల్లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు సుమారు రూ.10 వేల విలువైన కొత్త బట్టలను ఆయన పంపిణీ చేశారు.

పండుగ వేళ విద్యార్థుల ముఖాల్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో పుల్లయ్య ఈ సహాయాన్ని అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వారి సంతోషంలో భాగస్వాములు కావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

విద్యార్థుల పట్ల ఆయన చూపిన ఆప్యాయత, ఔదార్యానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. రఘోత్తమరెడ్డి, ఉపాధ్యాయులు ఆర్. శోభ, కె. అరుణజ్యోతి, కె. సంధ్య కృతజ్ఞతలు తెలిపారు. పండుగ సందర్భంగా కొత్త బట్టలు అందుకోవడం విద్యార్థులకు ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు మహేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో సిపిఎం నాయకుల నిరసన



చౌటుప్పల్ /అక్షితన్యూస్ : ఢిల్లీలో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి పైన, పొలిట్ బ్యూరో సభ్యులపైన, జాతీయ నాయకుల పైన, ప్రజలపైన ఢిల్లీ పోలీసులు విస్తృతంగా సాగించిన అణచివేతను, అక్రమ అరెస్టులను సిపిఎం చౌటుప్పల కమిటీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం సభ్యులు తెలిపారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేసినారు. శనివారం చౌటుప్పల్ హైవే రోడ్డుపైన బైఠాయించి నిరసన తెలియజేశారు.ఢిల్లీలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు, నిరసన కారుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణా రెడ్డి, ఎండి పాషా, గోశిక కరుణాకర్, గంగాదేవి సైదులు మాట్లాడుతూ.. పెద్ద ఎత్తున ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేయడానికి, ఇతర ఎన్నికల సంస్కరణలకు దారితీసిన ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు నిరసనలు చేపట్టారని తెలిపారు. దీనికి భయపడిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఢిల్లీ నగరంలో వర్చువల్ కర్ఫ్యూ విధించడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, మెట్రో స్టేషన్లను మూసివే యడం, ఇతర రవాణా మార్గాలను నిలిపివేయడం వంటి అణచివేత చర్యలకు పాల్పడడం దుర్మార్గమైన చర్యలని విమర్శించారు.సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, సీనియర్ నాయకురాలు బృందా కారత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు, ఎం.వి. గోవిందన్, విజయరాఘవన్, విజు కృష్ణ, అరుణ్ కుమార్, మరియం దావలే, పార్లమెంట్ సభ్యులు జాన్ బ్రిట్టాస్ తదితరులను జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న సమయంలో పోలీసులు అతిగా ప్రవర్తించి అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని , ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రజలు సాగిస్తున్న పోరాటానికి ఈ అణచివేత చర్యలు అడ్డంకి కాలేవని వారు తెలిపారు. ఇప్పటికైనా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, జ్ఞానేష్ కుమార్ ను బర్తరఫ్ చేయాలని, సర్ ప్రక్రియను ఆపివేయాలని, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేసి మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బండారు నరసింహ, బత్తుల దాసు, గోపగోని లక్ష్మణ్, యాట బాలరాజు, సప్పిడి రాఘవరెడ్డి, ఇట్టబోయిన శేఖర్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# పదేళ్లు గడిచినా పలిమెలకు అందని పాలన..

**ప్రజలను ఇంకా ఎన్నాళ్లు ఇబ్బంది పెడతారు**

**మండలం పలిమెలలో.. ప్రభుత్వ కార్యాలయాలు మహాదేవపూర్‌లోనా**

**కార్యాలయాలను పలిమెలకు తరలించాలి**

**ప్రజా కుల సంఘాల జేఏసీ చైర్మన్ పీక కిరణ్ మౌర్య డిమాండ్**



అక్షిత, మంథని ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఏర్పడి నేటికి పదేళ్లు గడుస్తున్నా, మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలు మహాదేవపూర్‌లోనే కొనసాగుతుండటం దురదృష్టకరమని ప్రజా కుల సంఘాల జేఏసీ చైర్మన్ పీక కిరణ్ మౌర్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలం ఏర్పడినప్పటికీ ప్రజలకు స్థానికంగా ప్రభుత్వ పాలన అందుబాటులోకి రాకపోవడం పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఈ సందర్భంగా పీక కిరణ్ మౌర్య మాట్లాడుతూ.. మండలం ఏర్పడి పదేళ్లు పూర్తయినా పలిమెల ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మండలానికి సంబంధించిన పనుల కోసం ప్రజలు మహాదేవపూర్‌కు వెళ్లాల్సి రావడం వల్ల పేదలు, రైతులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రయాణ ఖర్చులతో పాటు సమయం వృథా అవుతూ ప్రజలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ప్రజలకు పరిపాలనను చేరువ చేయాల్సిన ప్రభుత్వం, ప్రజలే ప్రభుత్వ కార్యాలయాల కోసం దూరప్రాంతాలకు వెళ్లే పరిస్థితిని కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా పలిమెల ప్రజల సమస్యకు మాత్రం పరిష్కారం లభించకపోవడం బాధాకరమన్నారు.

పలిమెల మండలం ఏర్పాటు చేసినప్పుడు ప్రజల్లో ఎన్నో ఆశలు కల్పించారు. కానీ పదేళ్లు గడిచినా ఆ ఆశలు నెరవేరకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పలిమెల మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలను పలిమెలలోనే ఏర్పాటు చేయాలని కిరణ్ మౌర్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అజ్మీర ఫుల్ సింగ్ నాయక్. కో కన్వీనర్ రామగిరి రాజు. తదితరులు పాల్గొన్నారు

## సాహితి వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కాలేజ్ ఇంచార్జి సనాతన రమాదేవి, ప్రిన్సిపాల్ రవి**



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: సాహితి వొకేషనల్ జూనియర్ కాలేజ్ అచ్చంపేట లో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరిగాయని కళాశాల ఇంచార్జి సనాతన రమాదేవి మరియు కళాశాల ప్రిన్సిపాల్ రవి అన్నారు.ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు ఉంటేనే వారి మూర్తిమత్వం అభివృద్ధి చెందుతుందని , తెలంగాణ ఆడపడుచుల సాంప్రదాయ పండగ బతుకమ్మ పండుగ అని అన్నారు.కాలేజ్ ఇంచార్జి సనాతన రమాదేవి మాట్లాడుతూ పసుపుతో గౌరమ్మను చేసి, ప్రకృతి సిద్ధమైన రంగురంగుల పూలతో బతుకమ్మ ను పేర్చి మన తెలంగాణ ఆడపడుచుల తరతరాల సంప్రదాయము ముందుతరాలకు అందిస్తూ బతుకమ్మను ఆట పాటలతో చిన్న పెద్ద తేడా లేకుండా అందరం సంబరాలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు, అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సయ్యద్, సీ పి ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి, కళాశాల సిబ్బంది ప్రసాద్, దీక్ష, రమ్య, మనీషా, కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్ , అటెండర్ అలివేల తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

**ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జీజీహెచ్‌లో అవగాహన కార్యక్రమం**



హైదరాబాద్ అక్షిత ప్రతినిధి : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జి జి హెచ్‌లో శనివారం మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక సమస్యలను ముందుగానే గుర్తించడం, అవసరమైనప్పుడు వైద్య సహాయం పొందడం, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వారి అనుభవాలను గౌరవిస్తూ, మాటలను శ్రద్ధగా వినడం ద్వారా వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నవ కళ్యాణి, జీఎంసీ కుత్బుల్లాపూర్ ప్రిన్సిపల్ డాక్టర్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ నవ్య కళ్యాణి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## యువ క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే జీయంఆర్**



వనపర్తి అక్షిత ప్రతినిధి : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పేట నాంచారమ్మ గ్రామంలో ఉర్సును దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దర్శించుకున్న సందర్భంగా గ్రామ యువకులకు ఎమ్మెల్యేను క్రికెట్ కావాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి యువకులకు క్రికెట్ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని యువతను క్రీడల వైపు మళ్లించడానికి వారిలోని ప్రతిభను వెలికితీయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. క్రీడా సామగ్రిని అందజేయడంతో పాటు, విద్యార్థులు, యువకులు క్రమశిక్షణతో ప్రేరణాత్మక లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. క్రికెట్ కిట్లను అందుకున్న యువకులు ఎమ్మెల్యే జీఎంఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## కవిత డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరం గట్టయ్య సెంటర్ లోని కవిత డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయక దుస్తులతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా రకరకాల పువ్వులతో అందమైన బతుకమ్మలను రమణీయంగా పేర్చి తయారు చేశారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి కవిత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ తెలంగాణలో అతి పెద్ద పండుగ అయిన దసరా పువ్వులతో ప్రకృతి ప్రసాదించిన వనరులతో చేసుకోవటం చాలా విశేషమని ఈ పండగ అందరి జీవితాల్లో సంతోషాన్ని ఆయురారోగ్యాలని నింపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కవిత పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రోజా రాణి అధ్యాపక అధ్యాపకేతర బృందాలు మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి నృత్యాలతో అబ్బురపరిచే సంబరాన్ని చేశారు.

## భూమి పూజ మహోత్సవం ఆహ్వాన పత్రాలు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పాలకుర్తి వెంకన్న



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరం 39 వ డివిజన్ లో శ్రీ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ మహోత్సవం సందర్భంగా డివిజన్ లో ఇంటింటికి తిరుగుతూ ఆహ్వాన పత్రాలు పంచిన కాంగ్రెస్ పార్టీ 39 వ డివిజన్ అధ్యక్షులు పాలకుర్తి వెంకన్న షాది ఖానా డైరెక్టర్ షేక్ జానిమియా కొనకండ్ల శ్రీనివాస్ గని బాయ్ సుధాకర్ ప్రకాష్ రామ్మూర్తి భాస్కర్ వెంకన్న డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## తోటపల్లి అంగన్వాడి సెంటర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరిగాయి. గ్రామ అంగన్వాడి సెంటర్ టీచర్ జ్యోతి. మరియు ఆయాలు వివిధ రకాల పూలతో బతుకమ్మలు పేర్చి సెంటర్ ఆవరణలో బతుకమ్మ, బొడ్డెబలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వేశారు. మాట్లాడుతూ విదార్థులకు చదువుతో పాటు ఆటపాటలు , తెలంగాణ ఆడపడుచుల సాంప్రదాయ పండగ బతుకమ్మ పండుగ అని అన్నారు. కాలేజ్ ఇంచార్జి సనాతన రమాదేవి మాట్లాడుతూ పసుపుతో గౌరమ్మని చేసి, ప్రకృతి సిద్ధమైన రంగురంగుల పూలతో బతుకమ్మ ను పేర్చి మన తెలంగాణ ఆడపడుచుల తరతరాల సంప్రదాయము ముందుతరాలకు అందిస్తూ బతుకమ్మను ఆట పాటలతో , అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ




### ఉనికి కోసం బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు

### బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ లో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోసమే డ్రామా రాజకీయాలు చేస్తోందని కిసాన్ నగర్ 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీలో ఉన్నవారినే కొత్తగా చేరికలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారని, ఇదొక పెద్ద ఫేక్ ప్రచారమని మండిపడ్డారు. కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్‌లోకి చేరికలు జరిగినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, సోషల్ మీడియాలో పబ్లిసిటీ కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడానికే ర్యాలీలు నిర్వహించి, చేరికల సమావేశాలు పెట్టడం సిగ్గుచేటన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు సర్వస్వం గులాబీమయం చేసుకున్న బీఆర్ఎస్ నేతలకు, ఇప్పుడు కాషాయ రంగును చూస్తే కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ప్రతి చిహ్నాన్ని గులాబీ రంగుతో నింపేసినప్పుడు లేని తప్పు, ఇప్పుడు కాషాయ రంగు కనిపిస్తేనే ఎందుకు వస్తోందని నిలదీశారు. టౌన్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ ఆ పదవికి అనర్హుడని, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఆయనను తిరస్కరించారన్నారు. మేయర్ పీఠాన్ని కోల్పోయి సింగిల్ డిజిట్‌కు పరిమితమైనా చల్లా హరిశంకర్ సిగ్గులేకుండా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఏడ్ల అశోక్, కంసాల శ్రీనివాస్ తదితరుల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. కరీంనగర్ కిసాన్ నగర్ లో దళితబంధు ఇళ్ళు ప్రొసీడింగ్స్ ల పేరుతో పేదల నుంచి వేల రూపాయలు వసూలు చేశారని, అందుకు సంబంధించిన ఆధారాలున్నాయని, దయచేసి వారందరికీ తిరిగి డబ్బులు ఇవ్వాలని కోరారు. బీసీ నాయకుల ముసుగు కప్పుకొని దొరల పార్టీ వెనుక తిరుగుతూ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళిత బంధు విషయంలో బాధితులు ఇప్పటికీ న్యాయం కోసం ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ వల్లే నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్, స్మార్ట్ సిటీ ద్వారా భారీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ఒక 'అవుట్‌డేటెడ్' పార్టీ అని, ఆ మునిగిపోయే నావలో చేరేందుకు ఎవరూ సిద్ధంగా లేరని విషయాన్ని బిఆర్ఎస్ నాయకత్వం గ్రహిస్తే మంచిదన్నారు. బిఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.. కరీంనగర్లో ఇక బి.ఆర్.ఎస్ కు స్థానం లేదని రాబోయే రోజుల్లో కరీంనగర్ అసెంబ్లీ లో కూడా బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రవీంద్ర భూపతి, మేకల వెంకటేష్, కర్రే పద్మా అనిల్, పొన్నం మొండన్న, కార్యకర్తలు గాలి సురేష్, కళ్యాణ్, విష్ణు ప్రసాద్, పవన్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఉద్యోగుల సంఘాల ఐక్య కూటమి గెలుపు

### కార్మికుల జీవితాలకే ఒక మలుపు

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘం కోసం జరిగిన ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ,ఎన్ఎంయూ కూటమి గెలుపు కార్మికుల జీవితాలకే ఒక మలుపు అని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్,టీఎంయూ, ఎన్ఎంయూ కూటమిల సమిష్టి కృషి, పట్టుదల మూలంగా ఆర్టీసీ ఎన్నికల్లో అత్యధిక డిపోలలో విజయం సాధించడం పట్ల, ఇంతటి భారీ మెజారిటీని అందించిన ప్రతి ఒక్క ఆర్టీసీ సోదరునికి, సోదరీమణులకు సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన శ్రీనివాస్ కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ ఎన్నికల్లో కరీంనగర్ రీజనల్ జోన్ అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ, ఎన్.ఎం.యూ కూటమిని గెలిచిన సందర్భంగా శనివారం కరీంనగర్ టూ డిపో ముందు పంజాల శ్రీనివాస్ ఆర్టీసీ కార్మికులకు స్వీట్లు పంపిణీ



చేశారు. కార్మికులు,నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ప్రధానంగా కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉండి,నిజాయితీగా,నిబద్ధతో పనిచేయాలనే సంకల్పంతో ఎన్నికల్లో పోటీచేసిన ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ, ఎన్.ఎం.యూ కూటమిని ఓడించడానికి ప్రత్యర్థి సంఘాలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా,ఎన్నడూ లేని విధంగా ఎన్ని కుట్రలు చేసినా, అధికార పార్టీ నాయకులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి, అధికారాన్ని అడ్డం పెట్టుకొని గెలుపు కోసం కార్మికుల మధ్య చిచ్చు పెట్టాలని చూసినప్పటికీ ఆర్టీసీ కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, కార్మిక హక్కుల కోసం పోరాడే వారు కావాలని, ప్రశ్నించే గొంతుకలు గెలవాలని,కార్మిక సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేస్తున్న ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఎంప్లాయిస్ యూనియన్ ను, టీఎంయూ,ఎన్.ఎం.యూ కూటమిని నమ్మి గెలిపించడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ఈ కూటమి అండగా ఉండాలని ఆర్టిసి కార్మిక సంఘ నాయకులకు శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, మచ్చ రమేష్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి చీర్లవంచ శ్రీనివాస్, చైర్మన్ కె.తిరుపతి, అధ్యక్షులు రంగాచారి, టీఎంయూ అధ్యక్షులు కనకయ్య,కార్యదర్శి ఎం.ఆర్.రెడ్డి, చైర్మన్ ఎం.వి.ఆర్.రెడ్డి, నాయకులు బాకం ఆంజనేయులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# పేదలకు ఇళ్లేవి..
# హామీలు ఎన్నాళ్లు!

**భద్రాచలం, అక్షిత న్యూస్:** ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలోనే నివసిస్తున్న నిరుపేదలకు సొంతింటి కల ఎప్పుడు సాకారమవుతుంది? కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎప్పుడు అందుతాయి? అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని, భూమి కొనుగోలు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. పట్టణంలోని 20 వార్డుల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న నిరుపేదలను గుర్తించి, నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వారికి అవకాశం కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి ఆదుకోవాలని ప్రజాసం క్షేమ సంఘం మహిళా కమిటీ డిమాండ్‌చేచింది...




### అద్దె ఇంట్లోనే జీవితాలు.. సొంతింటి కల మాత్రం దూరం!

ఈ సందర్భంగా ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు అందే దుర్గ మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో అనేకమంది నిరుపేదలు కూలి పనులు చేసుకుంటూ మూడు దశాబ్దాలుగా అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు, కుటుంబ పోషణ భారంతో సతమతమవుతున్న పేదలకు నెలనెలా ఇంటి అద్దె చెల్లించడం మరింత భారంగా మారిందన్నారు. అద్దె ఇళ్లలో నివసించే కుటుంబ పెద్ద అనారోగ్యంతో మరణిస్తే, ఆ కుటుంబం ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

### పథకాలు ప్రకటనలకే పరిమితం కావొద్దు!

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన పేదలకు నేరుగా అందాలని అందే దుర్గ డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలోని 20 వార్డుల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను సమగ్రంగా గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి, సొంతింటి కలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

### పేదలకు ఇళ్లు వచ్చే వరకు ఉద్యమం ఆగదు!

నిరుపేదలకు ఇళ్లు మంజూరయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అందే దుర్గ స్పష్టం చేశారు. ఈ నిరసన దీక్ష భద్రాచలంలోని అర్హులైన పేద కుటుంబాల హక్కుల సాధన కోసమే చేపట్టామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు వెల్లడించారు. పేదల పక్షాన ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ నిరంతరం పోరాటం చేస్తుందని, హక్కుల సాధన కోసం నిరుపేదలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### పోరాటానికి పలు సంఘాల మద్దతు

ఈ నిరసన దీక్షకు మద్దతుగా మహాజన మహిళా మండలి రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల లత, మాదిగ మహిళా సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చిట్యాల రజిత, జిల్లా నాయకురాలు కొప్పుల నాగమణి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అలవాల రాజా మాదిగ, మహాజన సమితి వ్యవస్థాపకుడు గడ్డం సుధాకర్, దళిత సంఘాల నాయకులు చింత నాగముత్యం, కోకిల గాంధీ తదితరులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పేదలకు ఇళ్ల కేటాయింపులో న్యాయం జరగాలని, అర్హులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ నాయకులు వెన్న రేవతి, మళ్లీడి సత్యవేణి, దలై స్వర్ణ, గంజి ఝాన్సీ, పుట్టి మేరి, పూసం సుజాత, శ్రీదేవి, ఎం. భార్గవి, రమాదేవి, సమీనా, జయమ్మ, కుమారి, మేకల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్‌లో
# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో పూల పండుగ అయిన బతుకమ్మ వేడుకలను తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆడపిల్లలు బతుకమ్మ ఆటపాటలతో సాంస్కృతిక కళలతో మహంకాళి అమ్మవారి వేషాధారణలతో కనులవిందుగా ప్రకృతి పరవసించేలా సంబరాలు అంబరాన్నంటేలా అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన ఈ పండుగను ప్రాచీన కాలం నుండి సాంప్రదాయకంగా జరుపుకుంటున్నామని, తెలంగాణలో అన్ని కుటుంబాలలోని ఆడపడుచులు వారి అన్నదమ్ములు కలకాలం ఆనందంగా జీవించాలని కోరుతూ తంగేడూ, బంతి, చేమంతి ఇంకా వివిధ రకాల పూలను బతుకమ్మగా పేర్చి గౌరమ్మను ప్రతిష్ఠించి 9 రోజుల పాటు జరుపుకునే పండుగ అని తెలియజేస్తూ కామ క్రోద, లోభ మధ మోహ అహంకారం మాత్సర్య అసూయ చిత్తం




మానస్ వంటి చెడు లక్షణాలు ప్రతి మనిషి దూరం చేసుకొని మంచివైపు నడవాలంటూ చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా విజయదశమిని జరుపుకుంటున్నామంటూ స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్ మన సంస్కృతి సంప్రదాయాలు పాటిస్తూనే నూతన ఆవిష్కరణలకు విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించుటకు చక్కటి ప్రణాళికలను సిద్దంచేసి ఆచరిస్తుందంటూ బతుకమ్మలతో వచ్చి అలరించిన విద్యార్థినులను ఉపాధ్యాయినిలను మరియు తల్లిదండ్రులను అభినందిస్తూ అందరికి బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరక్టర్ కొండా కృష్ణవేణి పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లలందరూ ప్రకృతిలోని తీరొక్కపూలను తెచ్చి మహాలయ అమావాస్య మొదలుకొని 9 రోజులు సద్దుల బతుకమ్మతో తెలంగాణ పూల పండుగ జరుపుకుంటూ రకరకాల పిండి వంటలను ప్రసాదాలుగా చేస్తూ తెలంగాణ సంస్కృతిని గొప్పతనాన్ని తెలియజేస్తూ కుటుంబమంతా కలకాలం సుఖసంతోషాలతో ఉండాలని గౌరమ్మను పూజిస్తూ జరుపుకునే పూలపండుగ ప్రకృతిపండుగ ఆడపడుచుల కేరింతల పండుగ బతుకమ్మ పండుగని తెలియజేస్తూ అందరికి బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సురేష్ ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు మరియు తల్లిదండులు పాల్గొన్నారు.

## ఖమ్మం 39వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పాలకుర్తి వెంకన్న



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరం 39వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పాలకుర్తి వెంకన్న నియామకమైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో డివిజన్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి యువ నేత తుమ్మల యుగేంధర్ కు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. 39వ డివిజన్లో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేసి కార్పోరేషన్ ఎన్నికల్లో విజయ దంక మోగించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ నెల 12న టిటిడి ఆధ్వర్యంలో కలియుగ దైవంశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ భూమి పూజకు డివిజన్ ప్రజలు తరలిరావాలని కోరారు.

## సిరిచెల్మలో 'శని' అమావాస్య పూజలు

### భక్తులతో ఆలయం కిటకిట



**ఇచ్చోడ అక్షిత న్యూస్:** శని అమావాస్యను పురస్క రించుకుని మండలంలోని సిరిచెల్మ గ్రామంలో అతి పురతనమైన మల్లికార్జునాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకోవడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది. ఆదిలాబాద్, ఇంద్ర వెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, బజార్ హత్నూర్, సిరికొండ, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర లోని నాందేడ్, యావత్మాల్, కిన్వట్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. జలాశయంలో భక్తులు శని స్నానాలు చేశారు. మల్లికా ర్జునుడిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకు న్నారు. శని దేవత విగ్రహాలకు నూనె, నవ ధాన్యాల తో శాస్త్రోక్తంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కిటకిటలాడుతూ సిరిచెల్మ గ్రామంలో సందడి నెలకొంది. భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు వసతులు కల్పించారు.

## జర్నలిస్ట్ వెంకన్న మాతృమూర్తి మృతి

### కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్, కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ డివిజన్ ఆంధ్రప్రభ రిపోర్టర్ గుండెపూరి వెంకన్న మాతృమూర్తి గుండెపూరి రాములమ్మ అనారోగ్యంతో స్వర్గస్థులైన విషయం తెలుసుకున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరు బాలకృష్ణ, దేశిడి శేఖర్ రెడ్డి, జవహర్, కె.ఇంద్రకుమార్ తలకొప్పుల సైదులు, ప్రభాకర్ రెడ్డి, మంద సైదులు, బిఆర్ఎస్ నాయకులు బి.రాంబాబు, తిరందాసు విష్ణు,మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, ఏడుకొండలు వారి స్వగ్రామమైన త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి వెళ్లి రాములమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్‌లో హోరెత్తిన బతుకమ్మ సంబరాలు

**తీరొక్క పూల బతుకమ్మలతో ఆడి పాడిన పాఠశాల చిన్నారులు**

**ప్రత్యేక ఆకర్షణగా పల్లకి నెలవంక తులసికోట బతుకమ్మలు**

**దసరా వేడుకలలో భాగంగా ఘనంగా రావణ దహనం**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరం స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు హోరెత్తాయి. పాఠశాల చిన్నారులు తమ తమ గృహాల నుంచి తీరొక్క రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆ బతుకమ్మలతో పాఠశాల మైదానానికి చేరుకున్నారు. పాఠశాల చిన్నారులు బతుకమ్మలన్నింటినీ పాఠశాల మైదానంలో ఉంచి బతుకమ్మల చుట్టూ వలయాకారంలో చప్పట్లు, తాళాలతో జానపద గేయాలతో నృత్యాలు చేస్తూ ఆడి పాడారు. బతకమ్మ బతకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో పాటలతో పాఠశాల ప్రాంగణం అంతా హోరెత్తింది. ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకి బతుకమ్మ, నెలవంక తులసి కోట బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలుత గౌరీ మాతకు పాఠశాల చిన్నారులు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ సంబరాలను ఆనందోత్సవాలతో నిర్వహించారు. అదేవిధంగా పాఠశాలల్లో దసరా వేడుకలను వైభవంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారికి మంగళకరంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రావణ దహన ఉత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఆడపడుచులు చెరువులు ప్రకృతి మాత విశిష్టతను చాటిచెప్తూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు ప్రపంచవ్యాప్తంగా మన తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నాయని తెలిపారు. పాఠశాలలో ప్రకృతి వైభవాన్ని చాటి చెప్పేందుకు ప్రకృతిని రక్షిస్తేనే మన మనుగడ నిరంతరాయంగా వర్ధిల్లుతున్నదనే సందేశాన్ని చాటి చెప్పేందుకు పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను వేడుకగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి బతుకమ్మ సంబరాల శుభాకాంక్షలు దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నమన్నారుఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## సోమిడి గౌడ సంఘం ఆధ్వర్యంలో దర్గా సొసైటీ డైరెక్టర్ బుర్ర బాబురావుకు సన్మానం



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** ఇటీవలే నూతనంగా దర్గా కాజీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ గా సోమిడి ప్రాంతానికి చెందిన బుర్ర బాబురావు నియమితులైనారు. ఈ సందర్భంగా శనివారం సోమిడి గౌడ కులస్థులందరు కలిసి శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ సన్నిధిలో సోమిడి గౌడ సంఘము అధ్యక్షులు బొల్లికొండ యాదగిరిగౌడ్ అధ్యక్షతన గణంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా తన నియమకానికి సహకరించిన సోమిడి గౌడ కులస్తులందరికీ బాబురావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లికొండ యాదగిరి, చిర్ర నర్సింగ్,బండికరుణాకర్, రాజేంద ర్,బుర్ర మహేందర్, పిల్లలకుమార్, బొల్లపెల్లి సురేష్, కొంరెల్లి,రాజేష్, శేఖర్ నాగపూరి సమ్మయ్య, రాంకీ, మోడం రమేష్, రాజు ఎర్రోళ్ల సురేష్, గౌని సాంబయ్య,దుబ్బాక సమ్మ య్య, డోలి రంజిత్ తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టాలెంట్ స్కూల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను టాలెంట్ స్కూల్, సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగాబతుకమ్మలను పేర్చి పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతనుఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. పండుగ ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఐకమత్యం, ప్రకృతి పరిరక్షణ వంటి విలువలను విద్యార్థులకు తెలియజేశారు.ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, సాంస్కృతిక చైతన్యం పెంపొందుతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, పాఠశాల ఇన్‌చార్జ్ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీకి ఎల్ఈడీ లైట్లు అందజేత



**వలిగొండ/అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తల్లి జ్ఞాపకార్ధంగా ఎల్ఇడి లైట్లను అందజేయడం జరిగింది. అందులో భాగంగా తమ తల్లిదండ్రులైన పాలేర్ల రాజయ్య కీ శే పాలేర్ల అంజమ్మ జ్ఞాపకార్ధంగా వారి కుమారులు పాలేర్ల వెంకటేష్, పాలేర్ల నరసింహ లు ఏడు ఎల్ఈడి బల్బులను గ్రామపంచాయతీకి విరాళంగా అందజేయడం జరిగింది. అంతేకాకుండా వాటిని అమర్చడానికి సైతం ఖర్చును వారే భరించారు. ఇంతటి మంచి పనిని చేసిన వారికి ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న పాలేర్ల వెంకటేష్, నరసింహలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, సెక్రటరీ సైదులు, వేముల మల్లేష్,జక్క దామోదర్ రెడ్డి, వాకిటి సంజీవరెడ్డి, కనుగొంటి పాండు నక్కలు నరేందర్ రెడ్డి,కటిక శ్రీనివాస్, వడ్డేమాన్ మధు,పర్వతం రాజు, పైల గణపతి రెడ్డి బుగ్గ మల్లయ్య, కళ్లెం జంగారెడ్డి, అలేటి పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గ సమావేశం

**మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నియామక కమిటీని ప్రకటించడం హర్షిణీయమని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కాసార్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం లక్కారం గ్రామ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన కార్యవర్గ సమావేశంను నూతన కార్యవర్గ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కాసార్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ..మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారస్ మేరకు చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పూర్తి కమిటీని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ఆమోదించి ప్రకటించడం జరిగిందని ఆయన తెలిపారు.చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటుకు సహకరించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సమావేశంలో నూతన కార్యవర్గ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రెటరీలు, ఇప్ప వెంకటేష్, ఎర్రగుని లింగస్వామి,ఉపాధ్యక్షులు అంతటి విజయలక్ష్మి బాలరాజు, బండమీది మల్లేష్,సయ్యద్ వాయుద్దీన్, చెరుకు లింగస్వామి వర్కాల వెంకట్ కుమార్, , స్పోక్ పర్సన్ సామకూర యాదయ్య, సెక్రెటరీలు గుండెబోయిన మనిత ఐలయ్య యాదవ్, ఓసు శ్రీజా రాజు, మమ్మద్ ఫిరోజ్, మట్టుపల్లి యాదగిరి, మాదాని గోపాల్, దోమటి దయాకర్ రెడ్డి, బత్తుల రాజు, జక్కర్తి సుధా, పేరుపల్లి సుమతి పాల్గొన్నారు.

## సమతుల్యమైన వ్యాపారం సంతృప్తికరమైన జీవితం

**నేడు బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో వ్యాపార వాణిజ్య వర్గాల సమావేశం**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రస్తుత ఆధునిక సమాజంలో వివిధ వృత్తులలో పని చేస్తున్న వ్యక్తులు మానసిక సంఘర్షణల మధ్య జీవితాలు గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం స్థానిక సేవాకేంద్రం నిర్వాహకులు బి.కె విజయలక్ష్మి, బి కే మనీషా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ అన్నారు. ప్రతి వ్యక్తి మానసిక ప్రశాంతతతో ఉన్నప్పుడే ఆయా రంగాలలో వారు రాణించేందుకు వీలు కలుగుతుందన్నారు. స్థానిక కిసాన్ నగర్ లోని మైత్రి కన్వెన్షన్ లో ఆదివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో "సమతుల్యమైన వ్యాపారం – సంతృప్తికరమైన జీవితం" అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం స్థానిక బ్రహ్మకుమారిస్ కేంద్రంలో సంబంధిత వివరాలను విలేకరులకు వెల్లడించారు.

బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలోని రాజయోగ ఫౌండేషన్ ద్వారా వివిధ వృత్తులలో ఉన్న వారికి మానసిక ఒత్తిళ్ళను తగ్గించుకొనే కార్యక్రమాలు అనేకం నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అందులో భాగంగానే కరీంనగర్ పట్టణంలోని వ్యాపార, వాణిజ్య వర్గాల వారికోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశం మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగుతుందన్నారు.

"వ్యాపారం లో విజయం మరియు సంతృప్తికరమైన జీవితం " రెండు కలిసి ఎదగ గలవా" అనే అంశంపై బిజినెస్ వింగ్ నేషనల్ కోఆర్డినేటర్ బ్రహ్మకుమారి దీప వ్యాపార వాణిజ వర్గాలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్, మేయర్ కోలగాని శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొని మార్గ దర్శనం చేయనున్నారని తెలిపారు.